

# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్ళై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

*(గత సంచిక తరువాయి)*

**మరొక స్త్రీ మొహంలోకి చూశా**. ఆమె బతికే వుంది. కాని రెండు వారాల్నించీ తిండి మొహం చూసినట్టులేదు. నిమ్మళంగా కళ్ళు కదుపుతూంది. నిమ్మళంగా నోరు తెరచి మూస్తు గుటకేస్తూంది. ఆమెకి యే మాత్రం శక్తి వున్నా "ఆకలి–దాహం" అని వుండును.

ఆమె పక్కనే వున్నవాడు పద్దెనిమిదేళ్ళ వాళ్ళావున్నాడు. కాని శవాకారంగానే వున్నాడు. కొంచెం చేతులు కదుపుతున్నాడు. ఏదో చెప్పాలని వుబలాట పడుతున్నాడు. కాని చెప్పలేదు. ఆకలి అతన్ని ఆర్చిపారేసింది. కబళం యిస్తే అందుకుందుకి చెయ్యెత్తలేదు. నోట్లో పెడితే మింగలేదు.

చచ్చిపోయిన వాళ్ళతో బాటు, చచ్చిపోతూన్న వాళ్లూ గంటకో గడియకో చచ్చిపోయేవాళ్ళు కలసి ఒక దగ్గిర పడి, చివర వూపిరినించి విముక్తి పొందే క్షణం కోసం యెదురు చూస్తున్నారు.

వీళ్ళంతా అందరిలా మనుషులే. వీళ్ళకీ కోర్కెలూ మమకారాలూ వున్నాయి. కాని నిలవ నీడలేక, పదిపూటల కొక్క పూటైనా గుక్కెడు గంజిలేక, మానం కప్పుకుందికి అంగుళం గుడ్డపాతలేక అల్లల్లాడి పోయేరు. వీళ్ళంతా యిలా ఒక్కరోజులో తయారవలేదు.

పల్లెల్లో, చిన్న చిన్న బస్తీల్లో, లేమికి దిగులు పడకుండా, కలిగినంతే పదివేలని, యేది కట్టుకుంటే అదే పట్టు బట్టని, యేది తింటే అదే పరమాన్నమనుకున్నారు. ప్రకృతి వడిలో పసి బిడ్డల్లా తృప్తిగా కాలక్షేపం చేసేరు. ఈ యుద్ధం వచ్చింది. నిత్యావసరమైన వస్తువులన్నీ వెయ్యపడగల పాముల్లాంటి కాంట్రాక్టర్ల ద్వారా పటాలాలకి తరలించబడ్డాయి. కూడు గుడ్డ లేక ప్రజలల్లాడిపోయేరు. తండ్రికి కొడుకులు, కూతుళ్ళుబరువైపోయేరు. భర్తకి భార్య భారమైపోయింది. సామాన్య మానవుడి బతుకొక పిశాచపు పిడికిలి బిగింపులో గిజ గిజ లాడిపోయింది. ప్రాణం కోసం మానం బజారెక్కింది.

ఎక్కడ చూసినా మందలు మందలు ముష్టివాళ్లు. ఎటువెళ్ళినా "సాయబ్! బొస్కిస్" (అంటే బిక్షిస్) నడుస్తూన్న శవాలు, నవ్వుతూ పిలుస్తున్న సుఖ రోగాలు. ఇదంతా ఒక రోజులో తయారైన రంగం కాదు. ఏళ్ళతరబడి, కరువు వాళ్ళని మొండి జలగలా పట్టి చుక్క చుక్కా నెత్తురు పీల్చింది. శకునికంటె చాకచక్యంగా వాళ్ళనినీతిమార్గం నించి తప్పించింది. దుశ్శాసనుడి కంటె క్రూరంగా వాళ్ల అభిమాన వస్త్రాపహరణం చేసింది. ఆకలి దెబ్బకి తట్టుకోలేక, భర్త భార్య చేత, తండ్రి కూతురు చేత కూడని పని చేయించేరు.

అయితే ఒక విశేషం. ఈ యుద్ధం సాకుతో మహమ్మారిలా కరువు ఊళ్ళకి వూళ్ళు చుట్ట బెట్టి, లక్షలాది అమాయక ప్రజల్ని గొంతు పిసికి చంపుతూంటే కుళ్ళిపోయిన వాళ్ళ శవాల్లోంచి కార్లు పుడుతున్నాయి. మేడలేస్తున్నాయి. సిల్కు చీరలు, అత్తరు సీసాలు, చిరునవ్వులు, చిద్విలాసాలు ఆ శవాల్ని ముట్టుకుని వెళిపోతున్నాయి. శవాల్ని యెవ్వరూ

పట్టించుకోడం లేదు. ఎలక్ట్రీ తీగకంటుకుని వేలాడుతున్న గబ్బిలం, మునిసిపలు చెత్తబండి కిందపడి చచ్చిన కుక్కపిల్ల, షావుకారు కొట్టిచంపి పడేసిన ఎలక, ఆకలి చావు చచ్చిపడిన మనిషి కళేబరం, అన్నీ సమానంగానే వున్నాయి.

"హవల్దార్!" ఓ.సీ. అరిచేడు.

నే నీలోకంలో తిరిగి పడ్డా. అతని వేపు చూశా.

"ఈ వెధవల్ని లేపి వెంటతరుము, నేనీరోత చూళ్ళేను..."

నా తల్లో పదిలక్షల సముద్ర తరంగాల మోత వినపడింది. అతని దవడ ఫెడీ మనిపిద్దామనిపించింది. కాని ఏం ప్రయోజన మనిపించింది.

"ఆ పని నువ్వే చెయ్యి..." అని నేను రైలు పెట్టెక్కి, అవతలి కిటికీలోంచి చూస్తూ సిగరెట్టు ముట్టించా. నా వెనక ఓ.సీ. వచ్చేడు. "ఐయామ్ సారీ..." అన్నాడు.

ఇంజను అరిచి బండి కదిలింది. చాలా దూరం వెళిపోయినా యింకా నా మనసులో ఆ శవాలు, శవాల్లాంటి మనుషులు మెదుల్తూనే వున్నారు. చచ్చిపోయిన తల్లిస్తనం చీకుతున్న బిడ్డ దృశ్యం నన్నిప్పటికీ, యిరవైనాలుగేళ్లైనా విడవలేదు.

## 10

రైలు కొమిల్లా చేరింది. స్టేషను చిన్నది. కాని పరిశుభ్రంగా వుంది. సైనికులున్న ప్రతిస్థలం పరిశుభ్రంగానే వుంటుంది. పటాలంలో పరిశుభ్రత ముఖ్యం. ప్లాట్‌ఫారంమీద సార్జంటు ఫోర్ సైత్ మా కోసం వేచివున్నాడు. సామాన్లు లారీలో సర్దేం. లారీ బైల్దేరింది.

కొమిల్లా చేరాక సాధ్యమైనంత త్వరలో పద్మని కలియాలనుకున్నా. కాని ఆ పని జరగలేదు. మా లారీ పిక్కడిల్లీ మీదుగానే వెళ్ళింది.

పిక్కడిల్లీ చాలా హడావుడిగా వుంటుంది. సాయంత్రం ఐదు గంటల దగ్గర్నించీ హడావుడి జోరెక్కుతుంది. అక్కడ మధ్యని ఒక అందమైన చెరువుంది. దానికి నాలుగు పక్కలా రోడ్లున్నాయి. ఇవతల పక్క మెయిన్ రోడ్డు, అవతల పక్క క్లబ్బు. అది యుద్ధం ముందు సిటీ క్లబ్బయి వుంటుంది. అది యిప్పుడు పటాలపు తెల్లవాళ్ళ క్లబ్బు.

పిక్కడిల్లీకి తూర్పుగా మూడుమైళ్ళ దూరంలో వై.ఎమ్.సి.ఎ. వుంది. ఈ మూడుమైళ్ళ దూరం చక్కనైన మెటలు రోడ్డు, వై.ఎమ్.సి.ఎ.కి యెదురుగానే మా తాత్కాలిక విడిది. అక్కడ నాలుగు పక్కా గదులున్నాయి. మిగలినవన్నీ బాషాలే. పక్కా గదుల్లో ఆఫీసు పెట్టేం, బాషాల్లో నివాసం.

కొమిల్లా ప్రాంతంలో యెంతమంది సైనికులున్నారో సరిగ్గా చెప్పడం కష్టం. పట్నం, పరిసరాలు, చుట్టూ వున్న గుట్టలు, లోయల్లో ఐదారు లక్షల సైనికులుండొచ్చు. అన్ని విభాగాలకీ చెందిన యూనిట్లూ వున్నాయి. అన్ని జాతుల వాళ్లు

వున్నారు. అది "ఫీల్డు ఏరియా". ఎక్కడ చూసినా సైనిక శకటాలే. ఎటుచూసినా నీటుగా, బలంగా హుషారుగా వున్న సైనికులే. ఈ ఆలిపు ఆకుపచ్చ సముద్రంలో సివిలియన్లు అగుపించడం లేదు. ఉన్న కొద్దిపాటి సివిలు విభాగాలవాళ్ళకి మిలిటరీ మీద యెలాంటి అధికారం లేదు.

మా ఆర్. హెచ్.క్యూ పిక్కడిల్లీ దగ్గిరగా ఒక పెద్దమేడలో వుంది. మర్నాడు సాయంత్రం అక్కడ ప్రభూని, మేలానీ కలిశాను. సాయంత్రం అక్కడే భోంచేసా.

మా యూనిట్ కి తిరిగి రావడానికి సిద్ధంగా ట్రక్కులేదు. తొమ్మిదైంది. రాత్రి అక్కడ పడుకున్నా. మా ఓ.సీ. యేమీ అనుకోడు, నాకంత స్వతంత్రం వుంది. కాని ఆ పని క్రమశిక్షణకి వ్యతిరేకం. అంచేత యేదైనా ట్రక్కు దొరకదా అని పిక్కడిల్లీ దగ్గిరకొచ్చా.

అనుకున్నట్టే అక్కడొక ట్రక్కు వుంది. అది వై.ఎమ్.సి.ఎ. దగ్గిరకెళుతుందా అని డ్రైవర్నడిగా. వై.ఎమ్.సి.ఎ. క్రాసింగు మీదుగా వెళ్లిపోతుందన్నాడు. నేను ట్రక్కులోకెక్కా. అనుకున్న దగ్గిర నన్ను దించి ట్రక్కు వెళ్లిపోయింది.

కొత్తవూరు. ఎటు వెళ్ళడమో తెలీదు, కనుక్కుందామన్నా అక్కడ యెవ్వరూ లేరు. బ్లాకౌటు మూలంగా చీకటి. నిజానికక్కడికి మా యూనిటు ఫర్లాంగు దూరంలో వుంది. కాని కొత్త వల్ల, చీకటివల్లా దారి తప్పిపోయేనని అనుమానం వేసింది. ఇంతలోయిద్దరెదురుగా వస్తున్నారు. దగ్గిరకి రాగానే వాళ్ళు మిలట్రీ ఆఫీసర్లని పోల్చా. సెల్యూటీ చేశా. "క్షమించండి. తోవ తప్పిపోయా. సిక్స్టిండియన్ హెవీ యాకాక్ వర్కుషాపు! మార్గం చెప్పగలరా?''

"ఎవరు నువ్వు?" ఒకరడిగేరు.

చెప్పేను.

"నీ గుర్తుబిళ్ళ యేదీ?''

"లేదు. తెలీదు..." గొణిగా

వాళ్ళు నాకు రెండు పక్కలా చేరేరు. తీవ్రంగా వున్నారని తెలుస్తూంది.

"A B64 M" రెండో కెప్టెను అడిగేడు.

"క్షమించండి. అది కూడా తెలీదు..." మళ్లా గొణిగా.

"ఇవాళ "వాచ్ వర్డ్" యేమిటి?" అతనే తీవ్రంగా ప్రశ్నించేడు.

"నాకు తెలీదు. నేను నిన్ననే వచ్చా...''

"అదేం లాభం లేదు. ఇదంతా మిలిటరీ స్థలం. నిన్ను పోలీసు స్టేషనుకి అప్పజెప్పవలసుంటుంది, రా"

ఇద్దరూ నాజేబులు తడిమేరు. వీపుమీద, పొట్టమీద తట్టిచూసేరు, తిరిగి "రా' అన్నారు.

మాట్లాడుతూనే నడుస్తున్నాం. కాని నాకు మతిపోయింది. అరెస్ట్ అయితే క్రమశిక్షణ దృష్ట్యా నా మీద చాలా నేరాలు ఆరోపించొచ్చు. దురదృష్టం అనుకున్నా, వాళ్ళకి యేంజెప్పినా లాభం లేదు. అలా మాట్లాడుతూ మా యూనిటు గేటువరకూ వచ్చా. మతిపోయి అదీ పోల్చుకోలేదు...

"సారూ! ఇదిదా నమ్మ యూనిట్టు. వాంగో సారూ..."

నేను వెనక్కి తిరిగి చూసా. డ్యూటీ గార్డు, డ్రైవర్ కుంజన్, నా బెంగ తీరింది.

"క్షమించండి సర్స్! ఇదే నా యూనిట్..."

కెప్టెన్లు నవ్వేరు.

"చూడు హవల్దార్, నువ్వు చాలా పొరపాటు చేశావు. ఇలా మరెప్పుడూ చెయ్యకు. ఈ చుట్టూ కొన్ని పరిరక్షిత స్థావరాలున్నాయి. పొరపాటున అలా వెళ్తే నిన్ను షూట్ చెయ్యొచ్చు. జాగ్రత్త?"

"గుడ్ నైట్ సర్స్...."

"...నైట్" వెళ్ళిపోయేరు, నవ్వుకుంటూ. బహుశా తిట్టుకుంటూ.

మేం అక్కడ మూడ్రోజులే వున్నాం. తరువాత మా అసలు స్థలం "లాల్ మోయ్" గుట్టల మీదికి వెళ్ళిపోయేం. అవి కొమిల్లా పట్నానికి ఆరేడుమైళ్ళ దూరంలో వున్నాయి. తోవ కడాకూ ఎగుడు దిగుడు యెర్రమట్టి గుట్టలు. యెర్రమట్టి గుట్టలు చాలా మేర వున్నాయి. వాటి చుట్టూ తోటలున్నాయి.

అక్కడ మొదట మా వర్కుషాపులకి గాని, నివాసాలకి గాని యెలాంటి ముందు ఏర్పాటూ లేదు. ముమ్మరంగా యుద్ధం జరుగుతూన్నప్పుడు "ఫీల్డు ఏరియా" లో పురోగమిస్తూన్న పటాలాలకి వసతులు మొదలైన సౌకర్యాలు ముందుగా జరగవు.

అప్పటికి మా వర్కుషాపుకి సంబంధించిన పరికరాలు, ట్రాన్సుపోర్టు మూడొంతులు సమకూరేయి. అంగబలంకూడా క్రమేపీ ఎక్కువౌతూంది. డ్రైవర్లు, ఫిట్టర్లు, టర్నర్లు, ఇన్‌స్ట్రుమెంటు మెకానిక్కులు, టెలికమ్యూనికేషను సాంకేతిక నిపుణులు ముఖ్యంగా శతఘ్నులకి సంబంధించిన నిపుణులు, మొదలైన వాళ్ళు, తెల్లవాళ్ళు, భారతీయులు వచ్చేరు. కాని అసలు పని యింకా జోరుగా ప్రారంభం కాలేదు. అత్యవసరమైన పనులు మాత్రం జరిగిపోతున్నాయి.

గుట్టకి పడమటి తట్టు లోయలో రెండు డేరాలెత్తి, వాట్లో ఆఫీసు పెట్టేం. గట్టుమీద మా నివాసాలకు కావలసినన్ని డేరాలెత్తేం. మా అసలు స్థావరం గుట్టకి తూర్పున పెద్ద మైదానం.

రోజూ ఒకసారి "కొరియరు" వచ్చి, టపాలిచ్చి, మా పోస్టు తీసుకుపోయేవాడు. అర్జంటు టపాలేమైనా వుంటే మేమే ట్రక్కు మీద వెళ్ళి "ఎయిర్ స్ట్రిప్పు"లో అందజేసేవాళ్ళం.

మాకు స్నానాల గదుల్లేవు. అడుగులోతు, అడుగున్నర వెడల్పు, ఆరడుగుల పొడుగు ట్రెంచిలు తవ్వేం. వాటిలో "గ్రౌండు షీటులు" (రబ్బరు గుడ్డ) వేస్తే, ఓ మాదిరి బాతుటబ్బుల్లా తయారయేయి. వాట్లో నీళ్ళు పోసి స్నానాలు చేసేం. కాని ఈ పని సిపాయిలకి నచ్చలేదు. అవి చూసి వాళ్ళు నవ్వివచ్చేరు. ఆ టబ్బులు వాడకుండా గుడ్డలిప్పుకొని నీళ్ళు పోసుకుంటూ గుట్టలన్నీ తిరిగేరు. నేను మాత్రం నా ట్రెంచి చుట్టూ గ్రౌండు షీట్లలో మరుగు యేర్పరచుకున్నా.'''

పదిహేను రోజుల తరవాత మా నివాసానికి వర్కుషాపులకి కావలసిన బాషాలు నిర్మించడం ఆరంభమైంది. ఈ పని ఒక సివిలియను కాంట్రాక్టరుకిచ్చేం. అది సుమారు లక్ష రూపాయల కాంట్రాక్టు. మా నివాసాలు గుట్టమీద, వర్కుషాపు కట్టడాలు మైదానం మీద తయారవుతున్నాయి.

నిర్మాణానికి ముందు గుట్టమీద మట్టి దిబ్బలు తవ్వి సమతల ప్రదేశం తయారు చెయ్యాలి. కూలీలు అక్కు పక్షుల్లా వున్నారు. నడ్డికి ఒక చింకి పాతగుడ్డ చుట్టుకుని చస్తున్నాం అన్నట్టున్నారు.

వాళ్ళలో చాలామంది నడివయసు దాటిన వాళ్ళు. నిటారుగా నిలబళ్ళేరు. వాళ్ళకితిండిలేదు. శరీరంలో శక్తి లేదు. మనసులో శాంతి లేదు. భవిష్యత్తు మీద ఆశలేదు. పని చెయ్యలేరు. "పికాక్సు''' (Pick Axe) యెత్తి బలంగా మట్టికొట్టలేరు. గడ్డపారతో మన్నుతియ్యలేరు, నిముషం సేపు తవ్వి చమటలు కక్కుకుంటూ, తలమీద గుడ్డపాతతోమొహం ఒత్తుకునేవారు. అలసిపోయి, కూలబడి, రెండు బీడీ దమ్ములాగేవారు. కాంట్రాక్టరు మనుషులు వాళ్ళని యెడ్లకి మల్లే తండ బొడిచేవారు. మట్టితట్టలుమోసేవాళ్ళలో పదేళ్ళ పసివాళ్ళు కూడా వున్నారు. వాళ్ళందర్నీ చూస్తే నాకు జాలేసేది. కాని యేం చెయ్యగలను? సిపాయిలకి టీ యిచ్చేటప్పుడు అప్పుడప్పుడు కూలీలక్కూడా యిప్పించేవాణ్ని.

క్రమంగా మూణ్నెలల్లో మా నివాసాలు, యూనిటు వర్కుషాపు గదులు తయారయేయి. వర్కుషాపు "ప్రవేశం" దగ్గిర గార్డు రూము, దానిపక్క మా ఆఫీస్. ఆఫీసు కెదురుగా స్టోర్సు, దానికి కొంచెం ఎగువని శతఘ్ని కర్మాగారం. గార్డు రూముకెదురుగా యెలట్రికల్ వర్కుషాపు, బ్యాటరీ చార్జింగుగది. ఇంకా రేడియో షాపు, మెకానికల్ ట్రాన్స్ పోర్టు షాపు, గారేజీ కొంచెం దూరంగా వున్నాయి. అతిసున్నితమైన పనిముట్లు, యంత్రభాగాలు వుండే ఇన్స్ట్రుమెంట్ షాపు రోడ్డుకి చాలా దూరంలో వుంది. అక్కడ ధూళి దుమ్ము వుండకూడదు.

మా నివాసపు బాషాలు గుట్టమీదున్నాయి. ఆఫీసర్లకి "బ్రిటిష్ అదర్ ర్యాంక్సు" కి "ఇండియన్ నాన్ కమిషన్డు ఆఫీసర్ల"కీ, సిపాయిలకీ వేరు వేరు మెస్సులున్నాయి.

అంటే మా యూనిటు తయారైందన్న మాట. పని చక చక సాగుతూంది. జపానీ బాంబరు విమానాలు ప్రతిరోజూ వచ్చి కొంత అలజడి కలగజేసి పోతూండేవి.

ఒక సాయంత్రం పిక్కడిల్లీ దగ్గిర క్లబ్బు హాలులో పటాలాల కోసం ప్రత్యేకంగా "సెలిబ్రేటెడ్ మణబర్దన్" బృందం నాట్య ప్రదర్శన వుంది. మేమంతా టికెట్లు కొనుక్కుని సాయంత్రం నాలుగ్గంటలకే వూళ్ళోకెళ్ళేం.

పిక్కడిల్లీ దగ్గర "సంగువిల్లీ" హోటలులో టీ త్రాగుతూ పద్మని గురించి ఆలోచించా. వాళ్ళ యిల్లూ అక్కడేవుంది. ఎందుకు వెతక్కూడదూ? పద్మ యేం చేస్తుంది. కమల్ తనకోసం ఒక హత్య చేసేడన్న సంగతి ఆమెకి తెలుసా? ఒక వేళ తెలియకపోతే నేను చెప్పాలా కూడదా? అతను మిలిట్రీలో చేరి అగర్తలాలో వున్నాడని కూడా చెప్పాలా? ఎవ్వరికీ ఆ రహస్యం చెప్పనని చేతిలో చెయ్యేసి అతనికి మాటిచ్చేనే.

టీ త్రాగి బైటకొచ్చా. ఇంకా యెండ బాగా కాస్తూంది. పిక్కడిల్లీ నడుస్తున్న పచ్చని వనంలా వుంది. పరధ్యానంగా నడుస్తున్నా. ఎదురుగుండా రోడ్డుకవతలపక్క ఒక కొబ్బరి చెట్టవుపించింది. ఎండలో తళ తళ మెరుస్తూ దాని ఆకులు గాలికి కదుల్తున్నాయి. అటూ యిటూ చూశా: మరో కొబ్బరి చెట్టవుపించలేదు. గబగబ నడచి ఆ కొబ్బరి చెట్టున్న యింటి ముందు నిలబడి లోపలికి చూశా. పాడుపడిన పాత గోడలున్నాయి. ఆ యిల్లు ఖాళీగా వున్నట్టుంది. లోపలికి వెళ్ళా. ముందున్న విశాలమైన ఖాళీ భాగంలో కొబ్బరి చెట్టూగుతుంది. అది మాట్లాడ గలిస్తే యెంత బాగుండు ననిపించింది. కొంచెం లోపలికెళ్ళా. అక్కడ గుమ్మంమీద ఒక బోర్డుంది–''ఆర్మీ రిక్రియేషన్ అండ్ స్పోర్టింగ్ స్టోర్స్''. లోపలికెళ్ళా.

ఇల్లు లోపల కొంచెం బాగానే వుంది. పాత యిల్లే, కాని బాగు చేశారు. అక్కడ ఒక సార్జంటున్నాడు. ఆ స్టోర్సులో యేంవున్నాయో అతన్నడిగి తెలుసుకొన్నా. కాని అది ముఖ్యం కాదు. ఆ యిల్లెవరిది? అందులో యెవరుండేవారు? అదీ నాక్కావల్సింది.

ఆ యింటి యజమాని నాలుగైదు నెలల క్రితం చచ్చిపోయేడు. మిగిలిన వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయేరు. ఇంటిని ఆర్మీవాళ్ళు అద్దెకి తీసుకుని లోపలి భాగం బాగు చేయించారు. అంతే, ఆ సార్జంటుకి తెలిసింది.

కొంపతీసి యిదే పద్మా వాళ్ళిల్లా! పాపం పద్మ తండ్రి చనిపోయేడా. అయ్యో! వాళ్ళెక్కడి కెళిపోయారో. ఇంతకీ యిది వాళ్లిల్లు ఔనో, కాదో! అయోమయంలో పడి బైటకొచ్చా.

మణి బర్దన్ బృందంలో మెరుపు తీగెల్లాంటి, గాలికంటె వడి కలిగిన కళాకారులున్నారు. అంతా కాకలు తీరినవాళ్ళు. అవాళ వాళ్ళ నాట్య ప్రదర్శనం అత్యద్భుతంగా వుంది. నృత్య ప్రదర్శనం చూసి ఆనందిస్తున్నానే గాని, మనసంతా పద్మ మీదే ఉంది.

లాల్ మోయ్ గుట్టలు యెర్రమట్టి గుట్టలు.

వాటిలో కొన్ని మరీ యెత్తుగా వున్నాయి. గుట్టల మీద చెట్లు లేవు. చిన్న చిన్న డొంకలున్నాయి.

ఆ గుట్టలొక్కొక్క దగ్గిర నిటారుగా రెండు వందల అడుగులెత్తు కూడా వున్నాయి. వాటి పరిధి వంకరటింకర్లగా వుంది. అక్కడక్కడ వాలుగావున్న రెండు గుట్టల మధ్య సన్ననిగోర్జిలు తయారయేయి. వర్షపు నీరు వాటిలో గెడ్డలా ప్రవహిస్తుంది. ఆ గుట్టలకి చుట్టూరా అతి సమీపంనించి, అతి దూరంవరకూ డొంకలూ తుప్పలూ వున్నాయి. పనస చెట్లకి

లెక్కా జమలేదు. అదంతా మొత్తానికి అడివి. ఆ అడవిలో అక్కడక్కడ పల్లెలున్నాయి. అక్కడ ముస్లిములు చాలామంది వున్నారు.

మా క్యాంపు ఆవరణలో రెండు మూడు పనస తోటలున్నాయి. పనస కాయలు, పళ్ళు కుప్పలు తిప్పలు. గజమెత్తు పనసపళ్ళు మా సిపాయిలు మోసుకొచ్చేవారు. ఆ తోట ఒక సాయిబుగారిది. ఆయన ఒకసారి మా దగ్గరికి జంకుతూ వచ్చి, మా అనుమతి పొంది, ఆరేడు పనసకాయలు దింపించుకుని సలాంచేసి వెళ్లేవాడు.

తోటలూ దొడ్డూ కాదు. చిన్న చిన్న యిళ్ళ దగ్గర్నించీ పెద్ద భవనాల వరకూ యెన్నిటినో పటాలం వశపర్చుకుంది. అంచేత యెన్నో కుటుంబాల వాళ్ళు స్వస్థలం విడిచి దూర ప్రదేశానికి వెళ్ళిపోయేరు. యుద్ధ సమయంలో యుద్ధరంగ ప్రదేశంలో సామాన్య సంసారులుండడం కష్టం.

లాల్మయ్ గుట్టల అందం శరత్కాలపు వెన్నెలలో చూడాలి. చంద్రుడు అక్కడ ప్రకాశించినట్టు మరెక్కడా ప్రకాశించదనిపిస్తుంది. వెన్నెల పాల సముద్రంలా నిండుగా, మంచి గంధంలా చల్లగా, తేనెలా తియ్యగా వుంటుంది. వెన్నెలరాత్రిళ్ళు ఆ గుట్లమీద నేనొంటరిగా తిరిగేవాణ్ణి. నిండు చంద్రుడు చేతికంది నట్టుంటాడు. ఆ ఎత్తు మంచి పరిసరాలు చూస్తుంటే కనుచూపుమేరంతా వెన్నెల ఏరుపొంగి నట్టుంటుంది. ప్రకృతి మద్యపానం చేసి వూగిసలాడుతూన్నట్టుంటుంది.

మార్గశిర మాసంలో ఆ వెన్నెల అందం వేరు. ఆ చలి అనుభవించాలి గాని చెప్పలేం. ప్రపంచం అంతా ఒక "ఫ్రిజిడేర్". దాంట్లో ఆకాశం, వెన్నెల, చందమామ గడ్డకట్టిపోయేరు. గదితలుపు కాస్త తెరిస్తే వెంటనే జలుబు చేసిపోయే ఆ హేమంత రాత్రిళ్ళు, నేను నా బాషా బైటకొచ్చి ఎదురుగా వున్న రాతిబండ మీద కూచుని, సిగరెట్లు కాలుస్తూ ప్రకృతి మజా చూసేవాణ్ణి. తెల్లవారుజామున మూడు గంటలప్పుడు కూడా అదేపని.

అప్పుడు మరొక ప్రత్యేకతుంది. చలిసంగతి సరేసరి వెర్రికుక్కలా కరుస్తూంటుంది. ఆ గడ్డకట్టిన వెన్నెల్లో, ప్రకృతి మైమరిచి నిద్రపోయిన నిశ్శబ్దంలో ఒక పక్షి అరిచేది. దాన్ని తెలుగుదేశంలో "తూతూరక్క" పక్షి అంటారు. ఉండి వుండీ జాలిగా అరుస్తుంది. ఆ అరుపు గుండెల్లో దట్టమైన మరుపు పొరల అడుగున అణిగి మణిగిన ఏదో జ్ఞాపకాల్ని కెలుకుతుంది. అవి సరిగా జ్ఞప్తికి రావు. అలా అని నిద్రపోవు. ఆ పక్షి తిరిగి తిరిగి అరుస్తుంది. గుండెలో ఏదో గాభరా వేస్తుంది. ఒక్కొక్కప్పుడు కళ్ళంట నీళ్లొచ్చేవి.

ఆ పక్షి "కట్టల్ ఫాగో" అని అరుస్తుందిట. కట్టల్ అంటే పనస, ఫాగో అంటే "పండవే" "పనసా పండవే."

తూతురక్క కథలాగే దీనికి ఒక జాతిపరమైన కథవుంది.

మేం కొమిల్లాలో వుండగా చెప్పుకోదగిన విశేషాలేవీ జరగలేదు. కాని ఒక్కటి మాత్రం చెప్పాలి. ఇది మిత్రుడు మేలాసింగు చెప్పిన కథ.

ఆర్. హెచ్.క్యూ. కి యెదురుగా రెండిళ్ళవతల ఒకటి రేకు ఇల్లుంది. అది ఒక కాంటీను. కాంటీను యజమాని నజిబుల్లా, స్వగ్రామం విడిచి అక్కడి కొచ్చి సుమారేడాదైంది. పల్లెటూరిలో బతుకుసాగలేదు. పట్నం వచ్చి యేదైనా వృత్తి చేసుకుని సంసారం సాగిద్దామనుకున్నాడు. మొదట ఒంటరిగా వచ్చేడు. ఉన్న పిసరూ పిప్పీఅమ్ముకుని కొంచెం డబ్బు తెచ్చుకున్నాడు. ఆ కొంప అద్దెకి తీసుకుని చిన్న కాంటీను పెట్టేడు. మొదట్లో టీ, బిస్కట్లు అమ్మేవాడు. మా ఆర్. హెచ్.క్యూ. తో కలిసి ఆ చుట్టుపట్ల దగ్గిరిగా నాలుగైదు మిలిట్రీ యూనిట్లున్నాయి. సిపాయిల బేరం వల్ల అతని వ్యాపారం కొంచెం మెరుగైంది. క్రమేణా వుడికించిన గుడ్లు, ఆమ్లెట్లు అమ్మకం ప్రారంభించేడు. నెలకోసారి స్వగ్రామం వెళ్ళి సంసారం యోగక్షేమాలు చూసుకునేవాడు.

అతనికిప్పుడు మనిషి సాయం అవసరమైంది. ఊళ్ళో మనుషులు నమ్మకస్తులు దొరకలేదు. దొంగచాటుగా వస్తువులు, డబ్బు యెత్తుకుపోతున్నారు.

నజిబుల్లా భార్య చనిపోయింది. ఇద్దరు కూతుళ్ళున్నారు. పెద్దది నగమా, పద్దెనిమిదేళ్ళది. రెండోది మెహర్, పదహారేళ్ళది. వాళ్ళిద్దర్నీ కొమిల్లా తీసుకొచ్చేడు. కాంటీను గది వెనక భాగంలో మరో చిన్న టిన్ రేకు గది కట్టేడు. దాంట్లో ముగ్గురూ వుంటున్నారు.

నగమా ఓ మాదిరిగా వుంటుంది. మెహర్ చాలా అందకత్తె. పట్నం వచ్చి కాస్త రెండు పూటలా తిండి పడేసరికి ఆ పిల్లకి బలం వచ్చింది. గత్యంతరం లేక వాళ్ళని తీసుకొచ్చాడేగాని నజీబుల్లాకి వాళ్ళను గురించి బెంగగానే వుంది. ఆ కాంటీను కొచ్చే వాళ్ళలో మూడొంతులు సిపాయిలే. అమ్మాయిలున్నారనగానే సిబ్బంది రాక యెక్కువైంది. వ్యాపారమయితే పెరిగింది. కాని పిల్లల గురించి ఆందోళన కూడా పెరిగింది. పల్లెటూళ్లో తనకిక యేమీ మిగల్లేదు. పట్నమే గతి, కాంటీనే ఆధారం. అప్పుడప్పుడు సిపాయిలల్లరి చేసేవాళ్ళు. రాత్రి పదైనా కదిలేవాళ్ళు కాదు. కూతుర్లుండే గదిలోకి జొరబడేవాళ్ళు. గల్లంతు జరుగుతూండేది. అల్లరి చేసినవాళ్ళు ఆర్.హెచ్.క్యూ. కి చెందిన వాళ్ళయితే మర్నాడు ఉదయం వచ్చి నజిబుల్లా భయం భయంగా సుబేదార్ సాబ్ తో చెప్పుకునేవాడు. ఆయన సిపాయిల్ని మందలించేవాడు.

ఓరాత్రి కొందరు సిపాయిలు నగమాని కాంటీను గదిలోకి లాగి చుట్టబెట్టి అల్లరి చేసేరు. నజిబుల్లా వాళ్ళని అదలించబోయేడు. సిపాయిలు రెచ్చిపోయి అతన్ని కొట్టి కాంటీన్ సామాన్లు ధ్వంసం చేసేరు. మర్నాడుదయం నజిబుల్లా సుబేదార్తో అంతా చెప్పుకుని ఏడ్చేడు. సుబేదార్ సాబ్ ఆ కేసు దర్యాప్తు చేయడానికి కాంటీనుకి వెళ్ళేడు. అక్కడ విరిగిపోయిన కుర్చీ, బెంచీలు, కప్పులు చూసేడు. లోపలికెళ్లి నగమాని, మెహర్నీ చూసేడు.

"చూడు మియా! నాకు చాలా విచారంగా వుంది, నీ నష్టానికి పరిహారం యిప్పిస్తా... ఎంత– ఓ వందరూపాయియలు నష్టపోయుంటావా?

"సాబ్! మీ దయ..." వినయంగా అన్నాడు.

"సరే! పూర్తిగా నష్టపరిహారం ఇప్పిస్తా. నీ కాంటీనింకా అభివృద్ధి అవుతుంది".

నజిబుల్లా సంతోషించాడు.

ఆ రాత్రి పది దాటేకా సుబేదార్ సాబ్ నజిముల్లా యింటి తలుపు తట్టేడు. నజిబుల్లా తలుపు తీసేడు. లోపల చీకటిగా వుంది. సుబేదార్ లోపలి కెళ్ళి టీ కావాలన్నాడు.

"సాబ్ మీరు పెద్దలు. అడిగితే కాదనగల్నా, కాని కాంటీను వేళైపోయింది..." నసిగేడు.

మిలిట్రీ మనిషి వీధి తలుపు మూసి లోపల గడియ పెట్టేడు. నజిబుల్లాకి అనుమానం వేసింది.

"పోనీ సాబ్. ఐదునిముషాల్లో టీ పెడతా..."

"చూడు మిస్టర్, నాకు టీ అక్కర్లేదు. నగమా, మెహర్ కావాలి." నజిబుల్లా అదిరిపడ్డాడు.

"సాబ్! మీరు పెద్దలు మేం బీదవాళ్ళం. అలా అనొచ్చా? క్షమించండి. మమ్మల్నిలా బతకనివ్వండి..." ప్రాధేయంగా అన్నాడు.

మిలిటరీ మనిషికి కోపం వచ్చింది. అసలే భీముడిలా వుంటాడు. తూస్తే రెండువందల యాభై పౌన్ల విగ్రహం. కళ్లెర్రజేసేడు,' మాట మీద మాట పెరిగింది, ఎంత చెప్పినా నజిబుల్లా వినలేదు. "సరే, నీ పన్జెప్తా. నా మాట ఖాతర్లేదు గదూ! చూడు నా తడాఖా. నువ్వూ నీ కూతుళ్ళూ కూలైనా చేసుకోవాలి. మాడి చావనైనా చావాలి." చరచర వెళ్లిపోయేడు.

మర్నాడుదయం పదిగంటల నుంచి నజిబుల్లా కాంటీను పటాలం సిబ్బందికి "ప్రవేశ నిషేధం" అయిపోయింది. తిండి, త్రాగుడు, స్త్రీ విషయంలో మంచి చెడ్డలాలోచించని సుబేదార్ గత రాత్రి జరిగింది అవమానంగా భావించాడు. దానికి ప్రతీకారం అదే అనుకున్నాడు.

ప్రవేశ నిషేధం వుత్తరువుతో నజిబుల్లా కాంటీను వెలవెలబోయింది. అతని పని సుమారు 'ఆట కట్టింది'. రెండ్రోజులు తరవాత నజిబుల్లా ఆర్.హెచ్.క్యూ కొచ్చి అడ్జటంటుతో చెప్పుకోవడానికి ప్రయత్నించాడు. కాని భీమసేనుడతన్ని గేటు దగ్గర్నించే గెంటిపారేసేడు.

పదిరోజులు దాటిపోయేయి. నజిబుల్లా పొయ్యిలో పిల్లిదూరి పడుకుంది, అతన్నీ అతని కూతుళ్ళనీ కడుపులో ఎలకలు గల్లంతు చేస్తున్నాయి.

అతనేమో స్వగ్రామంతో తెగ తెంపులు చేసుకొచ్చేడు. ఇక్కడ సంవత్సరం పైగా స్థిరపడ్డాడు. ఇక్కణ్ణించి కదిలి పట్నంలో మరెక్కడా వ్యాపారం పెట్టడం సుళువుకాదు. అయితే ఈ పరిస్థితి ఎలా యెదుర్కోవాలో అతనికి తోచలేదు.

ఓ నాడు రాత్రి వూళ్ళో తిరిగి తిరిగి నజిబుల్లా పదకొండు గంటలకిల్లు చేరుకున్నాడు. వీధి తలుపు మెహర్ తీసింది.

"అబ్బా! లోపలి గదిలోకెళ్ళకు..."

"ఏం?"

“లోపల సుబేదార్ సాబున్నాడు...”

అతను నీరైపోయేడు. నులక మంచం మీద కూలబడిపోయి తలపట్టుక్కూచున్నాడు.

కొంచెం సేపు పోయేక సుబేదార్ సాబ్ బైటకొచ్చేడు. అతని వెనకాలే నగమా వచ్చింది. ఆమెకి పదిరూపాయల నోటందించేడు.

“నాకొద్దు. అబ్బా కివ్వండి”

సుబేదార్ సాబ్ నోటు నజిబుల్లా కివ్వబోయేడు. అతను కన్నీళ్ళతో వద్దని సూచిస్తూ చేతులు తిప్పేడు.

“పుచ్చుకో అబ్బా. ఇది మనకు రావలసిన డబ్బు. సుబేదార్ సాబ్ ఎంతో మంచివారు..." మెహర్ నిర్భయంగా అంది.

తండ్రి పట్టరాని కోపంతో గది నాలుగు మూలలా వెర్రిగా చూసేడు. గొడ్డలో, గునపమో దొరికితే యిద్దరు కూతుళ్ళనీ చంపేద్దామనిపించింది. సుబేదార్ సాబ్ నోటు నులక మంచం మీద పెట్టి వెళ్లిపోయేడు. దాన్ని మెహర్ తీసింది.

“అబ్బా, విచారించకు. మాకు రెండ్రోజులైనా తిండిలేదు. నీకు వారం రోజులై లేదు. ఆకలితోనైనా చావాలి. ఆకలికి తట్టుకోలేకపోతే యెందులోనో పడైనా చావాలి. ఈ రెండుపన్లూ చెయ్యలేం, ఎంతకాలం యిలా? ఎప్పటికి దీనికి అంతం?” నగమా తలవంచి అంది.

అతనలా ఆలోచిస్తూ కూచున్నాడు. పట్నంలో ప్రతిరోజూ ఆకలి చావులు. చచ్చినవాళ్ళ శవాలవుపిస్తున్నాయి. రోడ్లపక్క, రైల్వే స్టేషను దగ్గర– యెక్కడబడితే అక్కడ. తమకీ, ఆ శవాలకీ అట్టే తేడాలేదు. నడ పీనుగులు, పీనుగులు.

ఆకలి మనిషిని వెర్రెత్తిస్తుంది. దొంగతనం చేయిస్తుంది. జారత్వానికి దింపుతుంది. హత్యలు చేయిస్తుంది. ఋషుల చేత తిట్లు తిట్టిస్తుంది. కుక్క మాంసం తినిపిస్తుంది.

మర్నాటి నించి ఆ కాంటీన్ మీద ప్రవేశ నిషేధం లేదు. నజిబుల్లా వ్యాపారం యెత్తిరిల్లింది. నగమా, మెహర్ పులుల మందలో చేరిపోయేరు.

11

కొమిల్లా లాల్ మోయ్ గుట్టల దగ్గిర మేం సుమారు సంవత్సరం వున్నాం. మాకు మళ్ళీ చలనం వచ్చింది. ఇదివరకులాగే మొదట ఆర్.హెచ్.క్యూ ముందు చిట్టగాంగు వెళిపోయింది. మళ్ళీ నాకూ నా మిత్రులు మేలా, ప్రభూలకీ ఎడబాటు కలిగింది. తిరిగి వీడ్కోలు విందులు "ఆరివైర్”లు

ఈసారి మేం నెల రోజులు వెనకుండిపోయేం. ఎలాగూ పురోగమించక తప్పదు. కాని సిపాయిల దగ్గర్నించి అందరికీ “ఎప్పుడు ఎప్పుడు” అనే తహ తహ ఎక్కువైంది. అందరికన్న మా ఓ.సీ. కి ఈ తపన భరించరానిదైంది. అతను

నిజంగా ఖిన్నుడైపోయేడు. ఆఫీసులో ఎప్పుడూ యిదే గొడవ. అతనికి ఎవరిమీదైనా చిరాకొస్తే, "నిన్ను వెనక్కి పంపించేస్తా" అనేవాడు. సైనికుడికి పురోగమించడం అంటే సరదా – గౌరవం. వెనక్కి వెళ్ళడం అవమానం.

మేం అగర్తలాలో వుండగా ఓసారి అతన్ని ఆఫీసర్ల మెస్ లో "ఫూల్"ని చేసి అంతా పక్కలు విరిగేలా నవ్వి ఆనందించారు. అవాళ మార్చి ముప్పై ఒకటో తేదీ. సాయంత్రం నాలుగ్గంటలకి నాదగ్గరకి ఎడ్జటంటొచ్చి ఓ కాగితం యిచ్చి రహస్యంగా టైపుచేసి యిమ్మన్నాడు. అది ఢిల్లీ హెడ్ క్వార్టర్సు నించి మా ఓ.సీ. కొచ్చిన బదిలీ ఆర్డరు. అందులో అతనికి బొంబాయి బదిలీ అయిపోయినట్టుంది, నేనది టైపుచేసి ఎడ్జటంటు కిచ్చా. అది అతను చదివి నన్నేదో సంతకం చెయ్యమన్నాడు. నేను పదివంకర్ల సంతకం చేశా.

మర్నాడు సాయంత్రం మెలో ఆఫీసర్లందరూ వుండగా ఒక సార్జంటు వెళ్ళి ప్రత్యేక "కొరియర్" ద్వారా వచ్చినట్టు ఒక కవరు మా ఓ.సీ. కిచ్చి వెళ్ళిపోయేడు. ఓ.సీ. కవరుచింపి చదివి నీరుకారిపోయాడు. అంతా ఏమిటేమిటని ఆతృతగా ప్రశ్నించేరు. అతను యేడుపు మొహం పెట్టి నిరుత్తరంగా ఆ కాగితం టేబిలు మీద పడేసి, రెండు గుక్కలు విస్కీమింగి పెద్ద ఆస్తిపోయిన వాడిలా కూచున్నాడు. అంతా అతనికి సానుభూతి తెలిపేరు. కొందరు అభినందించేరు. ఏప్రిల్ మూడో తేదీన బొంబాయ్ లో హాజరు కావాలి అంటే మర్నాడే ప్రయాణం. వెంటనే పార్టీ యేర్పాటుచేశారు.

మర్నాడుదయం ఓ.సీ. ఆర్డర్లీ దేవదాసు నా దగ్గర కొచ్చేడు.

"సార్ : "యూ ఫాడిట్" అంటేయేటి:"

"అదేమిటోయ్? నేనలాంటి మాట వినలేదే..."

"లేదు సార్, అదేమాట మొదట అడ్జటెంటు సాబన్నాడు. నవ్వేడు. తరవాత క్వార్టరు మాస్టర్ సాబు ఓ.సీ. తో "యూ ఫాడిట్" అని నవ్వేడు. తరవాత ఒక్కొక్కరే అదే అని నవ్వేరు. అంతా మళ్ళీ మళ్ళీ అదే నవ్వటం నవ్వటం, ఓరిబాబో, ఎంత నవ్వులో; ఒకటే గోల, ఒకటే నవ్వులు పడి పడి నవ్వి మన ఓ.సీ. సాబుని ఒకే తాటాకులు కట్టేరు. తరవాత మన ఓ.సీ. సాబూ నవ్వేడు. మళ్ళీ అంతా నవ్వేరు. ఏటిసార్ యూ ఫాడిట్టంతే..."

నాకు కొంచెం సేపటి వరకూ అర్థం కాలేదు. తరవాత అర్థమైంది. 'మేం పురోగమిస్తున్నాం, నువ్వు వెనక్కి వెళ్ళిపోతున్నావు. యూ హావ్ హాడ్ ఇట్" అని.

"హవల్దార్! మనం యిక్కడింకా యెన్నాళ్ళుండాలో?" బెంగగా అన్నాడు ఓ.సీ.

"రెండు మూడ్రోజుల్లో కదలొచ్చు..."

"ఓహ్! నాకు ఓపిక పోయింది."

నేనప్పుడే టపా యిప్పుతున్నా. ఆటపాలోనే వచ్చింది ఆర్డరు– మేం చిట్టగాంగు వెంటనే వెళ్ళాలని. ఓ.సీ. యెగిరి గంతేశాడు. ఆఫీసర్లని, సార్జంటు మేజర్ని పిలిపించేడు "మిస్టర్ రీడ్! మనం చిట్టగాంగుకి కదుల్తున్నాం, తక్షణం..."

హుషారుగా చెప్పేడు ఆర్మీలో లెఫ్టినెంటుని, సార్జంటు మేజర్ని మాత్రమే "మిస్టర్" అని సంబోధిస్తారు మిగిలిన వాళ్ళందర్నీ హోదాల తరవాత పేర్లు పెట్టి పిలుస్తారు.

"చిట్టగాంగ్ – చిట్టగాంగ్ చి–ఆ–గాం" పాట పాడేడు. ఓ.సీ.

అగర్తలానుంచి కొమిల్లా వెళ్ళినట్టే ముందు మా యూనిటంతా కదిలింది. మర్నాడు నేను, ఓ.సీ. ఆఫీసు ఆర్డర్లీ రైల్లో బైల్దేరేం.

మా రైలు చిట్టగాంగు చేరేసరికి సాయంత్రం ఏడుగంటలైంది. బాగా చీకటి పడింది. దీపాలు వెలుగుతున్నాయి.

చిట్టగాంగు వూరంతా కొండలు, గుట్టలు, లోయలు. కొండల మీద కూడా చక్కని రోడ్లు. మా స్టేషను వాగను కింద రోడ్డు మీంచి జోరుగా వెళ్లిపోతూంటే, రోడ్డు పక్కనే వున్న గుట్టమీద వెళ్ళిపోతూన్న కార్ల, లారీల దీపాలు కనిపిస్తున్నాయి. అవి మట్టిగుట్టలు కావు. ఆకుపచ్చగా జీవం వుట్టి పడుతున్నాయి. చిట్టగాంగు వంగ దేశపు ఆరామం (Garden of Bengal).

ఇక్కడ కూడా సివిల్ జీవితం పూర్తిగా నశించిపోలేదు. కాని మిలిటరీ వాతావరణంలో కనీ కనిపించకుండా వుంది.

మా యూనిట్ ఊరికి సుమారు తూర్పు చివర వుంది. మర్నాడుదయం నేను పళ్ళు తోముకుంటూంటే, ఎదురుగుండా "అరకాన్ రోడ్" అనే బోర్డు అవుపించింది. అరకాన్ రోడ్డు సరిగ్గా అక్కడే ఆరంభమైంది. అది వెడల్పుగా, నల్లగా, కొండ చిలవలా వుంది.

ఆర్.హెచ్.క్యూ ఆ రోడ్డుమీద రెండు ఫర్లాంగుల ఎగువని ఒక ఎత్తైన కొండమీద పెద్ద భవనంలో వుంది. నేను సాయంత్రం మేలాని, ప్రభూని కలియడానికి వెళ్ళా. వాళ్ళు సుబేదారు సాబు మేడమీద గదుల్లో వున్నారు.

మేలా గది కిటికీలోంచి చూస్తే, ఆయెత్తు మీంచీ గుట్టలు, లోయలు, మైదానాలు, తోటలు, వాగులు, చెరువులు, చాకిరేవులు పొడుగాటి యినపకడ్డీల్లా మెటలు రోడ్డు వాటిమీద కండ చీమల బారుల్లా పోతున్న లారీ కాన్వాయ్ లు, కిందికి వంగిపోయిన నీలిగొడుగులా ఆకాశం కనిపించింది. ఆ ప్రకృతి అందానికి వూపిరాగిపోయి నంతవుతుంది.

ఆ భవనంలో యెత్తుగా విశాలంగా ఎన్నో గదులున్నాయి. అది పూర్వం ఒక ప్రఖ్యాత కవిదట. ఆ కవి పేరు తెలీదు. అక్కడ ఏ మహా కావ్యాలు రాయబడ్డాయో, గానం చెయ్యబడ్డాయోగాని, ఇప్పుడందులో యినపబూట్లు కదంతొక్కుతున్నాయి.

యుద్ధానికి పూర్వం చిట్టగాంగులో ఆరు కళాశాలలు, అనేక ఉన్నత పాఠశాలలు వుండేవట. లక్షలాది మిలిట్రీ అక్కడ చేరుతూంటే ఒక్కొక్కటీ దూరపు పల్లెటూళ్ళకి తగ్గిపోయేయి. ఇప్పుడక్కడ ముఖ్యమైన ప్రభుత్వపు ఆఫీసులు, వర్తక వ్యాపార సంస్థలూ వున్నాయి. సినిమాల్లో, కాంటీన్లలో, క్రీడాస్థలాల్లో, పగటి బజార్లలో, రాత్రి బజార్లలో ఎక్కడ చూసినా పటాలం సిబ్బందే. నల్ల బజారు తప్ప వేరే బజారు లేదు.

లాల్ దిషీ దగ్గర "రంగూన్ ట్రేడింగ్ కో" అనే గొప్ప వ్యాపార సంస్థ వుంది. దాని అధిపతులు పెద్ద కాంట్రాక్టర్లు. వాళ్ళకక్కడ ఒక డిపార్టుమెంటల్ స్టోరు కూడా వుంది.

రంగూన్ ట్రేడింగ్ కో యజమాన్లు నలుగురన్నదమ్ములు. ఆఖరివాడు నన్నీ గోపాల్ సేన్, యిరవైరెండేళ్ళవాడు. ఒక మిత్రుడి ద్వారా అతనితో నాకు పరిచయమైంది. నేను వాళ్ళింటికి తరచు వెళ్ళేవాడిని. ఇంటిల్లిపాదీ నన్ను యింట్లో వాడిలాగే చూసేవారు. సేన్ కి ఒక అక్క, యిద్దరు చెల్లెళ్ళు కూడా వున్నారు.

సేన్ కుటుంబం డబ్బుగల వాళ్ళు, ధనవంతులు అంటే చాలదు, ఐశ్వర్యవంతులనాలి. సివిలు మిలిటరీ అధికార్లంతా వాళ్ళ స్నేహపు వలలో చేపలు, జల్లలు. మిలిటరీ సప్లై డిపార్టుమెంట్లతో సేన్ సంస్థకి కోట్లు విలువజేసే లాలూచీ వ్యవహారాలున్నాయని అంతా అనుకునేవారు. కాని ఆ తీగలాగితే డొంకంతా కదుల్తుందని ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు.

మొదట్లో అంత ఐశ్వర్యవంతుల యింట్లో ఎలా మెసలాలో తెలీక తికమక పడ్డా, కాని త్వరలోనే ఆ భయం తీరిపోయింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments